సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



ప్రతి ఇంటికీ ఇంటర్‌నెట్

రూ.190 ప్యాకేజీతో ప్రతి ఇంటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఫైబర్ నెట్ అధికారులు తెలిపారు. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

34.7°/ 11.5°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలీసుశాఖలో ముగ్గురు ఆర్ఐల బదిలీ



పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లను(ఆర్ఐ) బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఐ టైటాస్‌ను వైఎస్సార్ జిల్లాకు, నారాయణను కర్నూలు జిల్లాకు, రాజశేఖర్‌రెడ్డిని తిరుపతికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా గురువారం రిలీవ్ కానున్నారు. అలాగే కర్నూలులో ఆర్ఐగా పనిచేస్తున్న పి. రవికుమార్, అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న మహబూబ్ వలి, తిరుపతిలో పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను జిల్లాకు బదిలీ చేశారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ



పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న పలువురు తహసీల్దార్లను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు చీఫ్ కమిషనర్ సాయిప్రసాద్ నుంచి ఉత్తర్వులు అందాయి. జిల్లాలోని బదిలీ అయిన తహసీల్దార్లను వెంటనే రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో రామనాథరెడ్డి (ఓడీ చెరువు), రమాదేవి (కనగానపల్లి), హమీద్ బాషా (గాండ్లపెంట) నరేంద్రకుమార్ (ఎన్‌పి కుంట), రవి కుమార్ (నల్లచెరువు), శోభా సువర్ణమ్మ (తనకల్లు), రామాంజనేయరెడ్డి (కొత్తచెరువు), అన్వర్ హుస్సేన్ (అమడగూరు), వీవీ రమణ (పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం) బాబు (లేపాక్షి), రమేష్‌బాబు (అమరాపురం), జిలాని (పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం), వెంకటనారాయణ (కలెక్టరేట్ ఏఓ), అనుపమ (కలెక్టరేట్ సూపరింటెండెంట్), కరుణాకర్ (బుక్కపట్నం), రంగనాయకులు (గోరంట్ల), నాగరాజు(తాడిమర్రి), నాగేంద్ర (ముదిగుబ్బ), సయ్యద్ షాబుద్దీన్ (సీకే పల్లి), సుబ్బలక్ష్మమ్మ (కదిరి ఏఓ), నటరాజ్ (కదిరి), శ్రీధర్ (తలుపుల), స్వర్ణలత (పెనుకొండ), సురేష్‌కుమార్ (సోమందేపల్లి), అనంతాచారి (రొద్దం), సౌజన్యలక్ష్మి (పరిగి), హసీనా సుల్తానా (హిందూపురం), నాగరాజు (చిలమత్తూరు), మురళీకృష్ణ (గుడిబండ), వేణుగోపాల్ (రొళ్ల), జమానుల్లాఖాన్ (అగళి) ఉన్నారు.

ధర్మవరం ఆర్డీఓగా శివరామిరెడ్డి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. ఈ క్రమంలో ధర్మవరం ఆర్డీఓగా శివరామిరెడ్డిని నియమించింది. ఇక్కడ ఉన్న రమేష్ రెడ్డిని సీసీఎల్ఏలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. అలాగే కోనేరు రంగరావు కమిటీ (కేఆర్ఆర్‌సీ) డిప్యూటీ కలెక్టర్‌గా జె.శిరీషను, పీఏబీఆర్ ఎస్‌డీసీగా రాంభూపాల్‌రెడ్డిని, అహుడా కార్యదర్శిగా గౌరీశంకర్‌ను నియమించింది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరం

- ఒక్కసారి వేలిముద్ర వేస్తే రిజిస్ట్రేషన్ పూర్తి



హిందూపురం అర్బన్: స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇప్పటి వరకు క్రయ విక్రయదారుల నుంచి రెండోసారి తీసుకునే వేలిముద్ర ఇక అవసరం లేదంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మామూలుగా వివిధ రకాల రిజిస్ట్రేషన్లకు ఆధార్, ఫొటో ఆధారంగా డాక్యుమెంట్లు సిద్ధం చేసి ఈ-కేవైసీ ద్వారా క్రయవిక్రయదారుల వేలిముద్ర తీసుకుంటారు. వాటిని ఆన్‌లైన్‌లో సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించి దానిపై ఈ-సైన్ చేస్తారు. చివరిగా సబ్ రిజిస్ట్రార్ సమక్షంలో రికార్డుల్లో వేలి ముద్రలు వేసి దాంతో పాటు ఇరువురు సాక్ష్యుల డాక్యుమెంట్ చివరి పేజీలో సంతకాలు చేయడంతో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అయితే మొదటిసారి ఈ-కేవైసీలో వేసిన వేలిముద్రే ఇక నుంచి అన్నింటికీ సరిపోయేలా, సబ్ రిజిస్ట్రార్ సమక్షంలో మరోసారి వేలి ముద్ర వేయాల్సిన అవసరం లేకుండా చట్టంలో సవరణ చేస్తూ జీఓ జారీ చేశారు. దీంతో రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు బుధవారం నుంచి ఈ ప్రక్రియ చేపట్టారు. ఇది ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు.



ఈ చిత్రంలోని వృద్ధుడి పేరు భజంత్రీ ముని వెంకట్. 60 ఏళ్లు నిండగా, పింఛన్ కానుక కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అర్హత పరిశీలించిన అధికారులు నెల రోజులలోపే పింఛన్ మంజూరు చేశారు. మరుసటి నెల ఒకటో తారీఖునే వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము అందించాడని ముని వెంకట్ ఆనందంగా చెబుతున్నాడు. మూడేళ్లుగా తాను పింఛన్ తీసుకుంటున్నానని, ఏనాడు పింఛన్‌కు ఇబ్బంది పడింది లేదంటున్నాడు.



ఈమె పేరు మలిశెల్లి లక్ష్మమ్మ. ధర్మవరం పట్టణం కొత్తపేట. వితంతువు. వయసు మీదపడటంతో నడవలేని పరిస్థితి. వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులైన లక్ష్మమ్మకు ప్రతి నెలా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. తన లాంటి వారి ఇబ్బందులను అర్థం చేసుకుని వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె చేతులెత్తి మొక్కుతున్నారు. తాను బతికి ఉన్నంత వరకు ఆయన సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారు.



ఇతని పేరు బడన్నగారి నరసింహప్ప. పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి. డప్పు కళాకారుడైన ఆయనకు వయస్సు మీద పడటంతో ఏ పనీ చేసుకోలేక కుటుంబ పోషణకు ఇబ్బంది పడ్డాడు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నరసింహప్పకు ప్రతి నెలా డప్పు కళాకారుల పింఛన్ రూ.3 వేలు అందుతోంది. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి తలుపు తట్టి పింఛన్ సొమ్ము ఇస్తున్నాడని, తమకు ఇంతకంటే ఇంకేం కావాలని నరసింహప్ప సంతోషంతో చెబుతున్నాడు.

‘కానుక’ తలుపు తడుతోంది!

ఠంచన్‌గా పింఛన్

- ఒకటో తారీఖునే ఇంటి వద్ద అందజేత
- జగన్ పాలనలో సంతోషంగా లబ్ధిదారులు
- నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా సొమ్ము జమ
- నేడు జిల్లా వ్యాప్తంగా పండుగలా పింఛన్ల పంపిణీ

సాక్షి, పుట్టపర్తి

ప్రతి నెలా ఒకటో తేదీ భానుడి తొలి కిరణం ప్రసరించకముందే వైఎస్సార్ పింఛన్ కానుక చేతికి అందుతోంది. అభాగ్యుల మోముల్లో ఆనందం వికసిస్తోంది. ఏ ఆసరాలేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, డప్పుకళాకారులకు నేనున్నానంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఠంచనుగా పింఛన్ అందిస్తూ వారి జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపుతున్నారు.

అర్హతే ప్రమాణికంగా పింఛన్ కానుక

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ఆధారంగా వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్నారు. గత పాలకులకు భిన్నంగా పైసా లంచం లేకుండా.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా...అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేస్తుండగా...ఆ రోజు ఏ గ్రామంలో చూసినా.. పండుగ వాతావరణం కనిపిస్తోంది. మనవడు కానుక పంపాడని వృద్ధుడు...అన్నయ్య డబ్బు పంపాడని వితంతువులు, మా జగనన్న మా కోసం నిలిచాడని దివ్యాంగులు సంబరపడుతున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి పాలన అందించలేదని ప్రశంసలు కురిపిస్తున్నారు.



పింఛన్ లబ్ధిదారులకు రూ.4 వేల కోట్లకుపైనే లబ్ధి

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక జిల్లా వాసులకు పింఛన్ రూపంలోనే (2019–2023) రూ.4,131 కోట్లు లబ్ధి చేకూరింది. జిల్లాలో ప్రస్తుతం 2,64,725 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, వీరందరికీ ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని ఏటా రూ.250 మేర పెంచుతూ పోయారు. ప్రస్తుతం పింఛన్‌దారులకు రూ.3 వేలు అందుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ అమలులోకి రావడంతో పాటు వలంటీర్ల సేవలు ఊపందుకున్నాయి. ప్రతి వలంటీర్ తమ పరిధిలోని 50 ఇళ్లలో పింఛన్‌దారులకు ఒకటో తారీఖు ఉదయమే సొమ్ము అందజేస్తున్నారు.

జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు, లబ్ధి ఇలా

సంవత్సరం	లబ్ధిదారులు	చేకూరిన మొత్తం (రూ.కోట్లలో)
2019	2,44,998	723.24
2020	2,54,131	746.04
2021	2,60,731	793.32
2022	2,67,156	889.08
2023	2,74,839	979.584

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

జిల్లాలో పింఛన్ కానుక పంపిణీ గురువారం తెల్లవారుజామునుంచే ప్రారంభం కానుంది. జిల్లాలో 2,74,572 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.81.95 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను బుధవారం సాయంత్రమే సచివాలయ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

నిరీక్షణ తప్పింది



గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా పింఛన్ కోసం పనులు మానుకుని గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అలాంటి పరిస్థితి లేదు. ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చి వెళ్తున్నాడు. ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఎవరికీ పైసా లంచం ఇవ్వాల్సిన అవసరం కూడా లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్ ద్వారా నాకు రూ.1.25 లక్షల లబ్ధి కలిగింది.

– నరసింహప్ప, జమ్మానుపల్లి, మడకశిర మండలం

దివ్యాంగులకు ఎంతో మేలు



నాలుగేళ్లుగా ఒకటో తేదీ వలంటీరే ఇంటివద్దకే వచ్చి రూ.5 వేల పింఛన్ ఇస్తున్నారు. మాలాంటి దివ్యాంగులకు ఎంతో మేలు చేస్తున్న జగనన్నను ఎప్పటికీ మర్చిపోలేం. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి వ్యవస్థ తీసుకురాలేదు.

– ఖాదర్‌వలి, తనకల్లు

పక్కాగా అందజేస్తున్నాం



ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల చేతికి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము అందుతోంది. అవకతవకలకు తావులేకుండా అర్హులందరికీ పింఛన్ అందజేస్తున్నాం. అర్హతే ప్రామాణికంగా.. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉన్న వారికి ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము చేరుతోంది. వలంటీర్లు చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారు.

– కేఎస్ నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ వైస్ ఎంపీపీ



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: బత్తలపల్లి మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజారెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కేతిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న పాలన నచ్చి నేడు బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. సమష్టిగా కృషి చేస్తే ‘వైనాట్ 175’ నినాదం తప్పక సాకారమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బత్తలపల్లి మండల కన్వీనర్ గుమ్మళ్లకుంట జయరామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వీరనారప్ప, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ మంజూరు వేగవంతం చేయాలి

- ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏ మాత్రం అలసత్వం వహించకుండా నిర్దేశిత డ్రిప్, స్ప్రింక్లర్ల (బిందు, తుంపర) యూనిట్ల మంజూరు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీడీలు జి.ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్, ఏపీడీ ఫజులున్నీసాబేగం, ఉద్యానశాఖ డీడీ బి.రఘునాథరెడ్డితో కలిసి ఎంఐ ఇంజినీర్లు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లాలో 12,500 హెక్టార్లకుగాను ప్రస్తుతానికి 9,577 మంది రైతులకు 11,706 హెక్టార్లకు సూక్ష్మసాగు పరికరాలు మంజూరు చేయడంతో ప్రస్తుతానికి రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉందన్నారు. ఇంకా 800 హెక్టార్ల వరకు ఉన్నందున వారం పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక శ్రీసత్యసాయి జిల్లా లక్ష్యం 10 వేల హెక్టార్లు కాగా ప్రస్తుతానికి 6,170 మంది రైతులకు 7,190 హెక్టార్లకు మంజూరు చేయడంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉందన్నారు. ఇక రోజువారీ ప్రణాళికతో ప్రాథమిక, తుది పరిశీలన, బీఓక్యూ, బీఎంఎస్, మంజూరు, ఇన్‌స్టలేషన్, ట్రయల్ రన్, రైతుల నుంచి కన్ఫర్మేషన్ లెటర్లు తదితర ప్రక్రియ మరింత చురుగ్గా కొనసాగించాలని ఆదేశించారు. మంజూరు చేసిన రైతులకు వెంటనే పరికరాలను సరఫరా చేయాలని కంపెనీలను ఆదేశించారు. పరికరాల మంజూరులో నాణ్యతకు పెద్దపీట వేయాలని, ఐఎస్ఐ మార్కుతో ఇన్‌వాయిస్ ఆధారంగా అన్ని రకాల పరికరాలు వచ్చినట్లు రైతుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు. చిత్రంలో రెండు జిల్లాల పీడీలు, డీడీహెచ్

ఏటీవీఎంతో అన్ రిజర్వేషన్ టికెట్లు

- సీనియర్ డీసీఎం మనోజ్

గుంతకల్లు: రైల్వే జనరల్ ప్రయాణికులు ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్ (ఏటీవీఎం) ద్వారా అన్ రిజర్వేషన్ టికెట్లు కొనుగోలు చేయొచ్చని రైల్వే సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డిజిటల్ టెక్నాలజీ ప్రోత్సాహంలో భాగంగా రైల్వే శాఖ నాలుగేళ్ల కిత్రం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) ప్రవేశపెట్టిందన్నారు. అదే విధంగా ఏటీవీఎంలను కూడా అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న ఫీచర్లతో పాటు యూటీఎస్ మొబైల్ యాప్‌కు వర్తించే మూడు శాతం బోనస్ ఇప్పుడు ఏటీవీఎమ్ ద్వారా టికెట్ల కొనుగోలుకు వర్తింపజేసినట్లు వెల్లడించారు. యూటీఎస్ యాప్‌లో రైల్వే వ్యాలెట్ (ఆర్-వ్యాలెట్)ను ఉపయోగించవచ్చన్నారు. వినియోగదారులకు మొబైల్ యాప్‌లో ప్రింటెడ్ టికెట్ ఆప్షన్ కూడా వినియోగించవచ్చన్నారు. వీటిని బుకింగ్ కౌంటర్లు లేదా సేష్టన్ ఆవరణలో అందుబాటులో ఉన్న ఏటీవీఎంలో మొబైల్ నంబర్‌తో పాటు బుకింగ్ కోడ్ ఎంటర్ చేసిన తర్వాత ప్రింట్ వస్తుందన్నారు.



టికెట్‌పై అవగాహన కల్పిస్తున్న రైల్వే సిబ్బంది

జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలి

- క్రీడాకారులకు కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు

పుట్టపర్తి రూరల్: ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలోనూ సత్తాచాటి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు నిచ్చారు. పుట్టపర్తి విమానాశ్రయ సమీపంలో వై జంక్షన్ వద్ద ఉన్న క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు నిర్వహించారు. కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. కార్యక్రమంలో ‘పుడా’ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, కోచ్‌లు, పీడీలు, పీటీలు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ అరుణ్‌కుమార్

ప్రభుత్వ ఉపాధ్యాయుడి అదృశ్యం

- చెర్లోపల్లి రిజర్వాయర్ వద్ద ద్విచక్రవాహనం, సెల్, క్యారియర్

నల్లమాడ: మండలంలోని బాసంవారిపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆమల్లదిన్నె మహేంద్రరెడ్డి మంగళవారం అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... బాసంవారిపల్లికి చెందిన ఏ.రామకృష్ణారెడ్డి, వెంకటరమణమ్మ దంపతులకు మహేంద్రరెడ్డి, ఇద్దరు కుమార్తెలు సంతానం. మహేంద్రరెడ్డి అమడగూరు మండలం గుండువారిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అవివాహితుడైన ఆయన.. రోజూ ఇంటినుంచి ద్విచక్ర వాహనంలో పాఠశాలకు రాకపోకలు సాగించేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా క్యారియర్ తీసుకొని పాఠశాలకు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అయితే రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అతని సెల్‌కు ఫోన్ చేశారు. కానీ ఆయన సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీశారు.

చెర్లోపల్లి రిజర్వాయర్ వద్ద ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్

ఉపాధ్యాయుడు మహేంద్రరెడ్డి అదృశ్యమైన విషయం మండలంలో చర్చనీయాంశమైంది. ఈక్రమంలోనే కదిరి రూరల్ మండలం డి. చెర్లోపల్లి రిజర్వాయర్ వద్ద కట్టపై మహేంద్రరెడ్డి ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్, క్యారియర్ ఉన్నట్లు గుర్తించిన కొందరు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు రిజర్వాయర్ వద్దకు వెళ్లి కదిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కుటుంబీకులు కదిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, ఉపాధ్యాయుడు మహేంద్రరెడ్డి మంగళవారం పాఠశాలకు సెలవు పెట్టినట్లు చీటీని పాఠశాల హెచ్ఎంకు పంపినట్లు అమడగూరు ఎంఈఓ జిలాన్ బాషా తెలిపారు. అయితే బుధవారం కూడా మహేంద్రరెడ్డి పాఠశాలకు హాజరు కాలేదని తెలుసుకొని, తానే స్వయంగా రెండుసార్లు అతని సెల్‌కు ఫోన్ చేశానన్నారు. అయితే ఫోన్ రింగ్ అయినా తీయలేదని చెప్పారు.

భూ సేకరణలో అలసత్వం తగదు

పుట్టపర్తి అర్బన్: జిల్లా పరిధిలో నిర్మాణం కానున్న జాతీయ రహదారులకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి జాతీయ రహదారుల భూ సేకరణ అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ 342కు సంబంధించి ప్యాకేజీ -1 కింద ముదిగుబ్బ-పుట్టపర్తి వరకూ 54.77 హెక్టార్లకు రూ.182.75 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇక ప్యాకేజీ-2కు సంబంధించి 6.46 హెక్టార్ల భూమికి రూ.93.04 కోట్లు మంజూరైందన్నారు. అయితే భూమి కోల్పోయిన రైతుల్లో చాలా మంది బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వనందున వారి ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే ఎన్‌హెచ్-716జీ (బి.కొత్తకోట నుంచి హిందూపురం వరకూ), ఎన్‌హెచ్ 544 (బెంగళూరు- కడప- విజయవాడ), ఎన్‌హెచ్ 42 (బత్తలపల్లి- ముదిగుబ్బ- కదిరి) పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించ రాదన్నారు. నష్ట పరిహారంపై ఎవరైనా కోర్టుకు వెళితే...పరిహారాన్ని కోర్టులో జమ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, ముదిగుబ్బ, చిలమత్తూరు, ధర్మవరం తహసీల్దార్లు, జాతీయ రహదారుల సంస్థ డీఈలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కనగానపల్లి: చెట్టును ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా బయలుదేరిన లారీ.. బుధవారం ఉదయం కనగానపల్లి మండలం దాదులూరు సమీపంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఘటనలో డ్రైవర్ రవిచంద్ర (40) రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వచ్చిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి వెంటనే డ్రైవర్‌ను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రవిచంద్ర మృతి చెందాడు. కాగా, మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మంటలు వ్యాపించి బాలికకు గాయాలు



చికిత్స పొందుతున్న కీర్తన

ధర్మవరం అర్బన్: గుమ్మం ఎదుట పెట్టిన దీపం నుంచి దుస్తులకు మంటలు వ్యాపించి ఓ బాలిక గాయపడింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన రామాంజినేయులు, జయమ్మ దంపతుల కుమార్తె కీర్తన బుధవారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటోంది. చీకటి పడుతుండడంతో ఇంటి గుమ్మం ఎదుట జయమ్మ దీపాలు వెలిగించి, ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడ చేరుకున్న బాలిక దుస్తులకు మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మంటలు ఆర్పివేశారు. అప్పటికే కాలిన గాయాలతో బాధపడుతున్న బాలికను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం

ఉసురు తీసిన అలుపు



రోడ్డు ప్రమాదంలో దెబ్బ తిన్న ఈ కారు కర్ణాటకలోని బెంగళూరులోని రామ్మూర్తిన గర్‌కు చెందిన శ్రీదేవి (23) కుటుంబసభ్యులది. ఈ నెల 18న యాదిగిరిలో దైవదర్శనం చేసుకుని బెంగళూరుకు తిరుగు ప్రయాణమైన శ్రీదేవి కుటుంబసభ్యులు... పెనుకొండ సమీపంలోని తిమ్మాపురం బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఎదురుగా వెళుతున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. నరసమ్మతో పాటు కారు నడుపుతున్న భీమారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. సుదూర ప్రాంతం నుంచి డ్రైవింగ్ చేయడంతో అలసిపోయిన డ్రైవర్ కాసేపు ఎక్కడైనా విశ్రాంతి తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

ప్రాణాలు బలిగొన్న అతి వేగం



శ్రీనివాసులు... హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తుండే వారు. భార్య శ్యామల పరిగి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 31న విధులు ముగించుకుని తన కుమార్తెతో కలసి పరిగి మండలం కొడిగెనహళ్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. సేవామందిరం వద్ద పెన్నానది వంతెన దాగుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బైక్ రేసర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన రేసర్ క్షతగాత్రుడి గురించి పట్టించుకోకుండా వెనువెంటనే తన వాహనంతో ఉడాయించాడు. అటుగా వెళుతున్న వారు ప్రమాదాన్ని గమనించి వెంటనే శ్రీనివాసులును హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. వెనుక నుంచి వచ్చిన రేసర్ రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమిస్తూ అతి వేగంతో దూసుకెళ్లి శ్రీనివాసులు మృతికి కారణమైనట్లుగా ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు నిర్ధారించారు.

స్వీయ తప్పిదంతో ప్రాణాలు కోల్పోయి...



మృతుడు సుదర్శన్

తాడిమర్రి మండలం మోదుగుల కుంట ((తిరుమలాపురం) గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సాకే నరసింహుడు కుమారుడు సుదర్శన్ (22) బీకాం వరకు చదువుకున్నాడు. ద్విచక్ర వాహనం నడపడమంటే ఎంతో ఇష్టం. దీంతో తమకు ఇష్టం లేకపోయినా ఒక్కగానొక్క కుమారుడి కోరికను కాదనలేక ఓ స్పోర్ట్స్ బైక్‌ను తల్లిదండ్రులు కొనిచ్చారు. ఈ నెల 16న తన స్నేహితుడు సాకే నరేంద్రతో కలసి పనిపై తాడిమర్రికి వెళ్లిన సుదర్శన్... అదే రోజు రాత్రి తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. మోదుగులకుంట సమీపంలోని పోతులయ్య స్వామి ఆలయం దాటగానే ముందు వెళుతున్న మరో బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో వేగ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ కుటుంబసభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అదే రోజు సుదర్శన్ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న నరేంద్ర కూడా బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత మృతి చెందాడు. ఓవర్‌టేక్ చేసే క్రమంలో పాటించాల్సిన నిబంధనలు ఉల్లంఘించి, వేగ నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణంగా ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు నిర్ధారించారు.

- రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే ప్రాణాలకే ముప్పు
- వాహన చోదకుల్లో నగం మందికే డీఎల్!
- మైనర్ల చేతిలో వాహన ప్రమాదాలకు తల్లిదండ్రులదే బాధ్యత

హిందూపురం అర్బన్: రోడ్డు నిబంధనలు పాటించాలంటూ జిల్లా రవాణా శాఖ అధికారులు, పోలీసులు విస్తృత ప్రచారం చేస్తున్నా... కొందరి నిర్లక్ష్యం కారణంగా తరచూ ఎక్కడో చోట ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని ఘటనల్లో స్వీయ తప్పిదాలే ప్రమాదాలకు కారణం కాగా, మరికొన్ని ఘటనల్లో ఎదుటి వాహన చోదకులు రోడ్డు నిబంధనలు అతిక్రమించి మరో వాహన చోదకులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు భద్రతా నిబంధనలపై ఎక్కడికక్కడ యువతకు అవగాహన కల్పించే చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు.

పెరిగిన వాహనాల వినియోగం

ప్రస్తుత యాంత్రిక జీవనంలో వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలోనే మైనర్లు తమ చేతికి చిక్కిన వాహనాలను అతి వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో అధిక శాతం ఇలాంటివే కావడం గమనార్హం. సగానికి పైగా వాహనచోదకులు డ్రైవింగ్ లెసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నట్లుగా పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ క్రమంలో తనిఖీలను మరింత విస్తృతం చేయడంతో రోడ్డుపై పోలీసులను, రవాణా శాఖ అధికారులను గమనించగానే మైనర్లు తప్పించుకుని ఉడాయిస్తున్నారు. ఈ మూడేళ్ల వ్యవధిలో కేవలం హిందూపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోనే చోటు చేసుకున్న ప్రమాదాల్లో 41 మంది మృతి చెందగా 104 మంది క్షతగాత్రులైనట్లుగా పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే పోలీసుల దృష్టికి రాని ప్రమాదాలు ఇంతకు రెట్టింపు స్థాయిలో ఉంటాయి. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే ప్రమాదం జరిగినా కనీసం బీమా పథకాలు కూడా వర్తించవు. ఈ విషయం తెలిసినా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. దీంతో మైనర్ల చేతికి వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమవుతున్న తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినప్పుడే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా మహిళలు పూర్తిగా శిక్షణ పొందకనే వాహనాలతో రోడ్డుపైకి చేరుకుంటున్నారు. ఆ సమయంలో ట్రాఫిక్ రద్దీలో వారు తికమక పడి ఎదుటి వాహనదారులను ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నారు. మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రులు మానుకోవాలి.

– కరుణసాగర్‌రెడ్డి, డీటీసీ, హిందూపురం

జైలు శిక్ష తప్పదు



లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం తప్పు. మితిమీరిన వేగంతో దూసుకెళుతూ రోడ్డుపై వీలింగ్ చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఈ నాలుగు నెలల వ్యవధిలోనే వంద వాహనాలను సీజ్ చేశాం. 14 మందిపై కేసులు నమోదు చేశాం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదాలకు కారణమైన వారికి జైలు శిక్ష తప్పదు.

– శ్రీనివాసులు, సీఐ, హిందూపురం

టీడీపీ నేత అరెస్ట్

చిలమత్తూరు: స్థానిక ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడిన వీరాపురం పంచాయతీ హుస్సేనాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత బాబు రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వేణుగోపాల్ బుధవారం మాట్లాడుతూ... ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని ఉద్దేశించి చంపేస్తామని బెదిరించడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరు ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన బాబు రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పేలుడు పదార్థం నమిలి ఆవుకు గాయాలు

పెనుకొండ రూరల్: పేలుడు పదార్థం నమిలి ఆవు నోరు ఛిద్రమైంది. వివరాలు... పెనుకొండ మండలం ఎర్రమంచి పంచాయతీ హరిపురం గ్రామానికి చెందిన పాడిరైతు నల్లక్క బుధవారం ఉదయం సమీపంలోని కొండ ప్రాంతంలో తన ఆవును మేపునకు తోలుకెళ్లింది. ఆవు మేత మేస్తున్న తరుణంలో భారీ శబ్దం వెలువడడంతో మహిళా రైతుతో పాటు సమీప రైతులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఆవు నోరు పూర్తిగా ఛిద్రమై తీవ్ర రక్తస్రావమవుతోంది. పేలుడు పదార్థం నమలడంతో ఆవు గాయపడినట్లుగా తెలుసుకుని ఇంటికి తరలించారు. ఘటనతో రూ.50 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయింది.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పక్కాగా సాగాలి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



లబ్ధిదారులతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వం మహిళల పేరుతో ఇచ్చిన పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పక్కాగా సాగాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన ధర్మవరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే కూరగాయల మార్కెట్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. పట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సబ్ రిజిస్ట్రార్ రమణారావును ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గానికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు మైదానం అనువుగా ఉంటుందా అన్న విషయాన్ని ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్య, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఈఓ మీనాక్షిదేవి తదితరులు ఉన్నారు.

ప్రతి పంటనూ ఈ-క్రాప్ చేయండి : డీఏఓ



కోటపల్లి వద్ద ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

తనకల్లు: రైతులు సాగు చేసిన ప్రతి పంట వివరాలను పక్కాగా ఈ-క్రాప్ నమోదు చేయాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ జిల్లా అధికారి వైవీ సుబ్బారావు ఆదేశించారు. తనకల్లు మండలం తవళం, గేమేనాయక్ తండా, ముండ్లవారిపల్లి, కొక్కంటి, కొండవెనుకపల్లి గ్రామాలలో బుధవారం చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా లేకుంటే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్, సర్పంచ్ మునేనాయక్, వీఏహెచ్ కార్తీక్, వీఏఏలు షబానా, రజిత, చిన్నికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

బావిలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మంజునాథ్ (ఫైల్)

ఎన్పీకుంట: బావిలో పడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఎన్పీకుంట మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన బండారు మంజునాథ్ (24) నాలుగు నెలల క్రితం బెంగలూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. సొంత పనిపై మంగళవారం గ్రామానికి చేరుకున్న ఆయన సాయంత్రం నుంచి కనపడకుండా పోయాడు. మొబైల్‌కు కాల్ చేస్తే స్పందన లేకుండాపోయింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు గ్రామానికి సమీపంలో ఉన్న ఓ బావి వద్ద సెల్‌ఫోన్ మోగుతుండడం గమనించిన ఇద్దరు మహిళలు కాల్ లిఫ్ట్ చేసి, మాట్లాడారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. బావిలో మంజునాథ్ మృతదేహాన్ని గుర్తించి, వెలికి తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, మంజునాథ్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇష్టంతో చదివితే కష్టముండదు

ఓడీచెరువు: ఇష్టంతో చదివితే కష్టమైన సబ్జెక్ట్ అంటూ ఏదీ ఉండదని పదో తరగతి విద్యార్థులకు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి శివరంగ ప్రసాద్ సూచించారు. ఓడీ చెరువులోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో ఓడీచెరువు, కదిరి, అమడగూరు వసతి గృహాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పైదొలిగేలా చేస్తూ మెరుగైన మార్కులు సాధించేలా సబ్జెక్ట్‌ల వారీగా నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు హెచ్‌డబ్ల్యూఓ రవీంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కదిరి, అమడగూరు మండలాలకు చెందిన వార్డెన్లు, ఓడీచెరువు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు గౌరిశంకరరెడ్డి, మహేశ్వరరెడ్డి, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి : జేసీ



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం టౌన్: పోలింగ్ కేంద్రాల్లో సరిపడా సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అసెంబ్లీ ఎలెక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. బుధవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో అసెంబ్లీ పరిధిలోని తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్థానికంగా అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, లేపాక్షి తహసీల్దార్ బాబు, చిలమత్తూరు తహసీల్దార్ నాగరాజు, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'వాల్టా' పరిధిలోకి 48 గ్రామాలు

- 'అనంత'లో 6, శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా 42 గ్రామాలు



వాల్టా గ్రామాల్లో కొత్తగా బోరుబావి తవ్వకం నిషేధం

అనంతపురం అగ్రికల్చర్: వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్ (వాల్టా) పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 48 గ్రామ పంచాయతీలను నోటిఫై చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల పరిధిలో 188 గ్రామాలను వాల్టా పరిధిలోకి తెచ్చారు. ఇందులో అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 57 గ్రామాలు, రెండో స్థానంలో శ్రీకాకుళం జిల్లాలో 53 గ్రామాలు, మూడో స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలో 42 గ్రామాలు ఉన్నాయి. అలాగే పల్నాడులో 16, వైయస్సార్ జిల్లాలో 13, అనంతపురం జిల్లాలో ఆరు, చిత్తూరులో ఓ గ్రామం వాల్టా పరిధిలోకి తెచ్చారు. మిగిలిన 19 జిల్లాల్లో ఓ గ్రామం కూడా లేకపోవడం విశేషం

ఉమ్మడి జిల్లాలో ఇలా...

అనంతపురం జిల్లాలో పుట్లూరు మండలం కోమటికుంట్ల, మడుగుపల్లి, యల్లనూరు మండలం ఆరవేడు, బొప్పేపల్లి, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం గ్రామాలు ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి అగళి మండలం హులికెరదేవరహళ్లి, మధుడి, నరసంబుది, పి.బేడిగిర, అమడుగూరు మండలంలో కరినిరెడ్డిపల్లి, లోకాజిపల్లి, చిలమత్తూరు మండలం హుస్సేనాపురం, గాండ్లపెంట మండలం చామచేనుబైలు, చామలగొండి, గాండ్లపెంట, జీనులకుంట, కురుమామిడి, మడుగువానిగొండి, సోమయాజులపల్లి, గుడిబండ మండలం గునిమోరుబాగల్, కేకతి, ఎస్.రాయపురం, హిందూపురం మండలంలో దేవరపల్లి, గొల్లాపురం, కిరికెర, కొటిపి, కొట్నూరు, మనేసముద్రం, శ్రీకంతపురం, ఎన్పీ కుంట మండలంలో ఎదురుదోన, గూటిబైలు, ముదుపాలజూవి, రొద్దం మండలంలో చెరుకూరు, రొళ్ల మండలంలో బొమ్మగుండనహళ్లి, దొడ్డేరి, కాకి, ఎం.రాయపురం, రొళ్ల, తనకల్లు మండలంలో అగ్రహారంపల్లి, బాలసముద్రం, బొంతలపల్లి, చీకటిమానిపల్లి, దిగువమండలపల్లి, గుర్రంబైలు, కోటపల్లి, మద్దినాయనపాలెం, టి.సదుం గామాలున్నాయి. ఈ గ్రామాల్లో మోతాదుకు మించి భూగర్భ జలాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ గ్రామాల పరిధిలో బోరు బావుల తవ్వకాన్ని నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరం అయితే అనుమతులు తీసుకుని తాగునీటికి మాత్రమే బోరు బావుల తవ్వకం చేసుకునే వెసులుబాటు ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

జనవాక్కు

లక్షాధికారిని చేశారు



పూటకు ఠికానా లేని మమ్మల్ని సీఎం వైఎస్ జగనన్న లక్షాధికారిని చేశారు. నా భర్త సుభాన్ హోటల్‌లో పని చేస్తారు. చాలీచాలని సంపాదనతో 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నెట్టుకొచ్చాం. ఎంతో మంది నాయకులను కలిసినా మాకు పక్కా ఇల్లు మంజూరు కాలేదు. కనీసం స్థలం కూడా ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టేకులోడు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో నా పేరుతో ఇంటి పట్టా ఇచ్చారు. అంతేకాక అధికారుల సహకారంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసి, గృహ ప్రవేశం కూడా చేశాం. ఇప్పుడు మేముంటున్న ఇంటి విలువ రూ.లక్షల్లో ఉంటుంది. పూట గడవని స్థితిలో ఉన్న మమ్మల్ని లక్షాధికారిని చేసిన సీఎం వైఎస్ జగనన్నకే మా మద్దతు.

– షాకీరా, చిలమత్తూరు

జేసీని కలిసిన జెడ్పీ సీఈఓ



జేసీ అభిషేక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఈఓ నిదియాదేవి

పుట్టపర్తి అర్బన్: జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ వైఖోం నిదియాదేవి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమె జేసీకి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

'ప్రతి ఇంటికీ ఇంటర్నెట్'

హిందూపురం టౌన్: ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఆపరేటర్ల సంస్థ ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ మేనేజర్లు ధనుంజయ్, ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో కేబుల్ టీవీ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫైబర్ నెట్ ద్వారా వినియోగదారులకు కేవలం రూ.190కే ఇంటర్నెట్ ప్యాకేజీని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇంత తక్కువ ధరకు ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఇతర ఏ సంస్థలూ అందించలేవన్నారు. అలాగే సంస్థకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓఎల్‌టీలు ఏర్పాటు చేశామని, ఏపీఎస్ఎఫ్ఎల్ ఇంటర్నెట్ ప్యాకేజీలపై ప్రజలను చైతన్యపరిచి కనెక్షన్లు పెంచి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఆపరేటర్లు మహేష్, శివ, శివశంకర్, వెంకటేష్, శ్రీకాంత్, అశోక్‌లతో పాటు పలు మండలాల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మీరు వెళ్లొద్దు సార్!

- ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి కన్నీటి వీడ్కోలు



కన్నీటి పర్యంతమవుతున్న విద్యార్థులను ఓదారుస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మయ్య

అగళి: గురువు.. విద్యార్థి భవితకు బాటలు వేసే క్రమంలో తండ్రిలా దండించగలడు.. సన్మార్గంలో నడిపించే క్రమంలో తల్లిలా లాలించగడు. అందుకే ప్రతి విద్యార్థికీ గురువు ఆదర్శం. విద్యాబుద్ధులు నేర్పే క్రమంలో ఒక్కో టీచర్ ఒక్కో మార్గాన్ని అనుసరిస్తుంటారు. కొందరు కాస్త కఠినంగా ఉంటే... మరికొందరు ప్రేమగా బతుకుపాఠం నేర్పుతారు. అలా కాసింత ప్రేమను పంచి అక్షరజ్ఞానం నేర్పే గురువులంటే పిల్లలకు అమితమైన ప్రేమ. ఆ టీచర్ ఒక్కరోజు పాఠశాలకు రాకపోయినా తల్లడిల్లిపోతారు. అదే టీచర్ ఏకంగా ఉద్యోగ విరమణ పొందితే... బుధవారం అగళి మండలం హళ్లికెర ప్రాథమికోన్నత పాఠశాలలో అదే జరిగింది. పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మయ్య ఉద్యోగ విరమణ పొందగా, ఎంఈఓ భాస్కర్, ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం జరుగుతున్నంత సేపు విద్యార్థులంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు. కార్యక్రమం ముగిశాక ఉపాధ్యాయుడు లక్ష్మయ్య వెళ్లిపోతుండగా.. చిన్నారులంతా ఆయన్ను చుట్టుముట్టారు. 'మీరు వెళ్లొద్దు సార్' అంటూ కన్నీటితో ప్రాధేయపడ్డారు. చిన్నారులు తనపై చూపిన ప్రేమతో లక్ష్మయ్య కూడా కన్నీంటి పర్యంతమయ్యారు. ఇదంతా గమనిస్తున్న స్థానికులు గురుశిష్యుల ఆత్మీయ బంధాన్ని కొనియాడారు.